# ఇరువది ఆఱవ ప్రసంగము

తరువాతిరోజున ఉదయము అందరును టీ వేళకు శ్రీనిత్యానందస్వామివారిచెంత సమావేశమయిరి. పెద్దవిద్యార్థి ఇట్లు ప్రశ్నించెను :—

"క్షమించండి. తెలిసికొనుటకుమాత్రమే ప్రశ్నించుచున్నాను. మా విజ్ఞానవాదము దేవుని అంగీకరించదు. అంతయును స్వభావసిద్ధమేనని అనును. దేవుని అస్తిత్వమునుగురించి తమ అభిప్రాయము ఏమిటో దయయుంచి తెలియజెప్పుడు."

## దేవుని అస్తిత్వము

స్వా. ని. :—ప్రొఫెసరుజోశీ మీగురువులు. వారు ఉపనిషత్తులు, సూత్రములు, భాష్యాదులు మొదలగునవి అధ్యయనము చేసియున్నారు. వారిని ప్రశ్నించుడు. నేను చదువుకొనలేదు.

ప్రొ. జోశీ :—తమ ఎదుట చెప్పుటకు తగిన తాహత్తు నాకు లేదు. తమ శ్రీముఖమునుండి వినదలచియున్నాను. తమరే చెప్పుడు.

స్వా. ని. :—వైజ్ఞానికుల అభిప్రాయమునకును, వైజ్ఞానికుల పద్ధతికిని మధ్య భేదము కలదు. వైజ్ఞానికపద్ధతిప్రకారము జగన్నియంతను గురించిన ప్రశ్న అప్రస్తుతము. ఏలనన, వైజ్ఞానికపద్ధతి దృశ్యజగత్తును ప్రయోగముద్వారా తెలుపుటకు ప్రయత్నించును. కావున ప్రస్తుతము అడిగిన ప్రశ్న వైజ్ఞానికుల వ్యక్తిగతాభిప్రాయముగా తెలిసికొనవలెను.

ఈశ్వరుని అస్తిత్వమునుగురించి ఆలోచించినను ఆఆలోచనలు వ్యక్తిగతాభిప్రాయములనుకొనవలెననియే చెప్పవలసివచ్చుచున్నది. సర్వమాన్యమగు సిద్ధాంతరూపమున గ్రహించవీలులేదు. దృశ్యపదా

ర్థమునుమాత్రమే విజ్ఞానము ప్రయోగముద్వారా ఋజువుజేసి సత్యమని తలచును. అదృశ్యము ప్రయోగసాధ్యము కాదు.

ప్రభువునుగురించిన కల్పన కల్పనమాత్రమే. వ్యక్తిగతమగు కల్పన వ్యక్తిగతవైశిష్ట్యముపై ఆధారపడియుండును. "ఇది అంతయు స్వభావసిద్ధమే'' అని వైజ్ఞానికులు తలచెదరు.

పెద్దవిద్యార్థి:—దేవునిగురించి తమ అభిప్రాయము సెలవిండు.

## సృష్టికర్త ఉండవలెను.

స్వా. ని. :— దేవుని అస్తిత్వమును అంగీకరించకపోయినను సృష్టికర్త ఒకడు ఉండవలెనుకదా! ఎట్లన, ఒకఅరణ్యమధ్యమున తోటలలో ఒక భవనము కలదనుకొనుడు. దానిలో ప్రస్తుతము ఎవరును లేకపోయినను, ఎప్పుడో ఒకప్పుడు ఆ భవనమును ఎవరో నిర్మించిరనియు, వారు మరణించిరనియు, అనంతరము అ భవనము పాడువడినదనియు అనునది ఊహించదగినదికదా!

## సృష్టికార్యమును చేసినవాడు సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు చైతన్యస్వరూపుడు.

అటులనే సృష్టికికూడ ఎవడో ఒకకర్త ఉండి ఉండవలెననునది యుక్తిసంగతము. ఆసృష్టి అనెడు కార్యము మరియొకవిధముగా జరుగదు. కావున ఆసృష్టికర్త సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు చైతన్యస్వరూపుడని తెలిసికొనవలెను. అనగా కార్యముచే కారణమును ఊహించవలెను. సృష్టియను కార్యమునకు కారణముసర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు చైతన్యస్వరూపుడగు దేవుడని ఊహించవలెను.

## వైజ్ఞానికుల దృష్టిలో జగత్తుకుఉపాదానకారణము పరమాణువు.

పెద్దవిద్యార్థి:—విజ్ఞానదృష్టిని పరికించినచో పరమాణువుచే జగమంతయు ఉత్పన్నమయినదని తెలియును. కాన జగమునకు పర

మాణువు ఉపాదానకారణమని తెలియుచున్నది. అందుచే జగత్కారణము దేవుడని అంగీకరించవలసిన అవసరము ఏమియును లేదు.

## మధ్యవర్తియగు తటస్థ స్వభావము.

స్వా. ని. :—పరమాణుస్వభావమును గురించి మొదట ఆలోచించెదము.

పృథ్వి, జలము, తేజము, వాయువు- వీనికి పరమాణువులు కలవు. ఈ అన్నిరకములగు పరమాణువుల స్వభావము ఒకటేనా? లేక వేరువేరు స్వభావములు కలవా? ఒకే స్వభావము అన్నచో పరమాణుభూతస్వభావగతమగు వైలక్షణ్యాభావముచే కార్యవైలక్షణ్యమునకు తావు లేదు. కానికార్యమునందు వైలక్షణ్యము ప్రత్యక్షసిద్ధము. అందుచే కార్యగతవైలక్షణ్యముచే పరమాణురూపమగు కారణమందు స్వభావవైలక్షణ్యమును అంగీకరించవలెను. పరమాణువైలక్షణ్యముచే ఒకపరమాణువుతో మరియొకపరమాణువునకు కలసంబంధములచే విలక్షణపరిమాణములు కలుగుచున్నవి. ఈ ప్రత్యక్షములగు పరమాణుస్వభావములయందు పరిణామములను కలుగజేయు కారణము వేరొకస్వభావమని తెలిసికొనవలెను. ఏలనన ఏభౌతిక పదార్థమును అన్యపదార్థసంయోగముకాని, అన్యపదార్థస్వభావప్రభావముకాని లేనిదే రూపాంతరమును పొందదు. ఈకారణముననే మావిజ్ఞానవేత్తలు వేరువేరు పరమాణువుల స్వభావములను కలుపుటకు మధ్యవర్తియగు వేరొక తటస్థస్వభావముయొక్క ఉనికిని అంగీకరించవలసి వచ్చుచున్నది.

## సమిష్టిస్వభావరూపుడు సృష్టికర్త.

ప్రతిపరమాణువుయొక్క స్వభావమును వేరువేరని అంగీకరించినప్పుడు వాని సహాయమున ఘటము తయారుచేయుటకు ఒక సమిష్టిస్వభావమును అంగీకరించవలెను, దాని ప్రభావమే ప్రతి పర

మాణు స్వభావముపైనను పడును. పృథ్వియొక్క ఒక అణువునకు మరియొక అణువునకును భేదము లేదు. కావున పృథ్వియొక్క పరమాణుస్వభావములయందు అభేదమును అంగీకరించుట యుక్తిసమ్మతము. కాని పార్థివపరమాణువుల స్వభావమును ఏకముచేయుటకు సమిష్టిస్వభావము కలదని కార్యవైవిధ్యము స్పష్టమగుటకు యుక్తిచే అంగీకరించవలెను. ఇటులనే జలము, తేజము, వాయువు మొదలగు వాని పరమాణువులను ఆధారముగా చేసికొని విచారించిన ఒకసమిష్టిస్వభావమును అంగీకరించవలసివచ్చును. ఆ స్వభావము అన్నిపరమాణుస్వభావములయందును వ్యాపకమయి ఉన్న సర్వవ్యాపకమగు సమిష్టిస్వభావము.

### "సత్" అను నియామక స్వభావమే ఆ సృష్టికర్త.

ఈవిధముగనే ప్రపంచమునందలి పదార్థములన్నియును పరమాణువులచే తయారయినవి అనియును, పరమాణుస్వభావములను సమ్మేళనముచేయు ఒక మహాత్స్వభావము (వ్యాపకస్వభావము) ప్రపంచమునంతను నియమించుచున్నదనియును అంగీకరించవలసియున్నది. ప్రతిపదార్థముయొక్కయు స్వాభావిక అస్తిత్వము వ్యాపక అస్తిత్వముచే శాసించబడుచున్నది. ఆవ్యాపకవస్తువు "సత్" స్వరూపము. ఆవస్తువు "అసత్" అనుకొనువారు దానిస్వభావముకూడ "అసత్" అని ఒప్పుకొనవలసివచ్చును. "అసత్" నుండి "సత్" ఉద్భవించు ననునది యుక్తము కాదు. కావున ప్రతిపదార్థస్వభావమును శాసించు పూర్ణస్వభావమే జగత్తునంతను నియమించుచున్నది. భావమును నియమించు ఈపూర్ణస్వభావము సద్రూపము.

### సచ్చిదానందస్వరూపమును, సర్వస్వభావనియామకమును అగు స్వభావమే పరమేశ్వరుడు.

చైతన్యమునందు కన్పించు జ్ఞానసత్యస్వభావము, జడమందలి చైతన్యముయొక్క క్రియాసత్యస్వభావముమాత్రమే, జడపదార్థముల

క్రియాశక్తికిని, చైతన్యముయొక్క జ్ఞానశక్తికిని మూలస్వరూపము. ఈ విధముగనే సర్వస్వభావములను శాసించు స్వభావము "సత్" అను జ్ఞానరూపము. అది సచ్చిదానందమును, పూర్ణానందమును, సర్వశక్తిమయమును అగు వ్యాపకస్వభావము. ఈస్వభావము జగమునంతను-విశ్వమునంతను నియమించును.

ఈ పై చెప్పిన విధముగా విచారించిచూచిన బలమగు తర్కముతో స్వభావవాదమును చేయు విజ్ఞానశాస్త్రముకూడ తానెంతదూరముపోయినను అద్వితీయమును, సచ్చిదానందరూపమును, సర్వస్వభావనియామకమును అగు ఒక స్వభావము ఉన్నదని ఒప్పుకొనవలసి వచ్చును. ఆ పదార్థమే పరమేశ్వరుడు అని అనుకొనవలెను. ఇట్లు తార్కికదృక్పథముతో చూచిన స్వభావవాదమునందుకూడ దేవుని అస్తిత్వము సిద్ధించును. పరమాణుస్వభావవాదులుగానుండి దేవుని అస్తిత్వమును ఒప్పుకొననివారు స్వభావవాదముయొక్క యథార్థతత్త్వమును తెలిసికొనుట లేదు.

## సృష్టి అను కార్యమునకు కర్త ఉండవలెను.

మీ తత్త్వవిచారముప్రకారము జగమంతయు పరమాణుజనితము. ప్రతికార్యమునకును నిస్సంశయముగా రెండుకారణములు ఉండును. 1. ఉపాదానకారణము 2. నిమిత్తకారణము. కార్యమునకు ఉపాదానకారణము పరమాణువు అని తలచినచో వేరొకటి నిమిత్తకారణముగా మీరంగీకరించవలెను. ఘటమను కార్యమునకు ఉపాదానకారణము కపాలము అనగా మృత్తిక. అటులనే పటమునకు ఉపాదానకారణము తంతువులు. వానికి భిన్నములగు కుంభకారుడు, దండము, చక్రము మొదలగునవి నిమిత్తకారణములు కదా! అవియే ఉపాదానకారణమును వ్యవస్థీకరించి ఘటరూపమును, పటరూపమును పొందించును. అటులనే జగమునకు ఉపాదానకారణము పరమా

ణువు అయినను ఈశ్వరుని కాదనుటకు వీలువడదు. పరమాణువు చేతనమా? అచేతనమా? చేతన మనినచో అనేక చేతనములను సంయోగపరచు ఒక వ్యాపక చేతనమును అంగీకరించవలసివచ్చును. అచేతనము అనినను ప్రతిపరమాణుస్వభావమును శాసించు ఒక స్వతంత్రస్వభావమును ముందుచెప్పినవిధముగా అంగీకరించవలెను. ఈవిధముగ సృష్టియను కార్యము కర్త్రుసాపేక్షము. ఆ కర్త సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వస్వభావశాసకుడును అగు ఒక స్వతంత్రస్వభావమని మీరు అంగీకరించవలసి వచ్చును. అదియే దేవుడు. ఇట్లు విజ్ఞానదృక్పథములోకూడ ఈశ్వరుని అస్తిత్వము రుజువుఅగును.

## అనుమానప్రమాణముచేకూడ దేవుడు రుజువు అగును.

అనుమానప్రమాణముచేకూడ దేవుడు రుజువు చేయబడునని మనదేశపు ప్రాచీనవిద్వాంసులు తెలిసికొనిరి. సర్వతంత్రస్వతంత్రులగు శ్రీఉదయనాచార్యులు స్వీయరచితమగు కుసుమాంజలియను గ్రంథమునందు దేవుని రుజువుచేయుటకు కార్యత్వ, ఆయోజనత్వ, ధృతిత్వాది హేతువులు అనేకములను చూపించెను.

"కార్యాఽఽయోజనధృత్యాదేః"

కార్యత్వము, ఆయోజనత్వము, ధృతిమత్త్వము మొదలగు వానిచే దేవుడు రుజువు చేయబడును.

వానినిగురించి వరుసగా చర్చించెదము.

**కార్యత్వము:**—"క్షిత్యఙ్కురాదికం సకర్తృకమ్ కార్యత్వాత్ ఘటవత్"

ఘటపటాదికార్యములు సకర్తృకములు. కర్తచే నిర్వహించబడును. అటులనే పృథ్వి, పృథ్వీగతములగు అంకురాదులునుకూడ కార్యములగుటచే సకర్తృకములు. ఆ కర్త జీవభిన్నుడు. పృథివ్యాది ఉపాదానగోచరమగు అపరోక్షజ్ఞానమును, చికీర్షయును, కృతిమత్త్వమును కలిగియుండును. ఆతడు దేవుడు.

## అ యో జ న త్వ ము.

"సర్గాద్యకాలీన ద్వ్యణుకారమ్భక పరమాణుద్వయ సంయోగ జనకం కర్మ, చేతనప్రయత్నపూర్వకం, కర్మత్వాత్, అస్మదాదిశరీర క్రియావత్"

మనశరీరక్రియలు చేతనవ్యాపారముచే జరుగును. అటులనే సృష్ట్యాదినుండియు జరుగు ద్వ్యణుకము మొదలుకొని పరమాణు ద్వయ సంయోగము వరకును కల కర్మలు చేతన ప్రయత్నములే. కాని ఈచేతనము జీవస్వభావముకల చేతనముమాత్రము కాదు. సర్వ జ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు ఒక చేతనపదార్థము అని ఒప్పు కొనవలెను. అదియే దేవుడు.

## ధృ తి మ త్త్వ ము.

"ఏతత్ బ్రహ్మాణ్డం పతనప్రతిబన్ధకీభూతప్రయత్నవదధిష్ఠితమ్, ధృతిమత్త్వాత్, వియతి విహఙ్గమధృతకాష్ఠవత్.

ఆకాశమునందలి పక్షి తననోటిలో కట్టెను కరచుకొని ఉండు నట్లు ఈపృథివ్యాదులతో కూడిన బ్రహ్మాండమును ఎవడో పట్టుకొని ఉన్నాడా అనునట్లు ఉన్నది. ఈబ్రహ్మాండాదులు స్వకీయపతన ప్రతి బంధకమగు ఒకానొక ప్రయత్నయుతమగు పదార్థమున నిలచి యున్నవి. ఆపదార్థము సర్వశక్తియుతము అయి ఉండవలెను. అనగా బ్రహ్మాండమంతయు నిలచియుండుటకు వీలగు శక్తికలవాడు దేవు డనియే అంగీకరించవలెను.

ఈవిధముగనే దేవుని రుజువుచేయుటకు అనేకములగు అను మానప్రమాణములను చూపించవచ్చును.

## ఈశ్వరప్రోక్తమగు వేదముచేకూడ దేవుడు రుజువు చేయబడును.

అనుమానప్రమాణముచే దేవుడు రుజువు అగునట్లుగనే ఈశ్వర ప్రోక్తము అగు వేదముచేకూడ దేవుడు రుజువగును. ఎట్లనిన—

ద్యావాభూమీ జనయన్దేవ ఏకః విశ్వస్య కర్తా భువనస్య గోప్తా।

స్వర్గమును, భూమిని సృష్టించు ఒకే దేవుడు విశ్వమును సృజించును, రక్షించును.

వేదవ్యాసభగవానుడుకూడ బ్రహ్మసూత్రములయందు "జన్మాద్యస్య యతః" "ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్" మొదలగుసూత్రములచే ఈశ్వరలక్షణమును తెలిపెను.

"సృష్టిస్థితిలయములకు కారణుడు బ్రహ్మస్వరూపుడగు దేవుడు." "ప్రతిజ్ఞా దృష్టాంతములచే దేవుడు జగత్కారణము." అటులనే పతంజలిమహర్షి కూడ దేవుని రుజువుచేయుటకు వివరించెను.

"క్లేశకర్మవిపాకాశైరపరామృష్టః పురుషవిశేష ఈశ్వరః"

క్లేశము, కర్మ, విపాకము, సూక్ష్మవాసన- ఇవి లేని పురుషవిశేషము దేవుడు.

## జీవుని అస్తిత్వము.

పెద్దవిద్యార్థి:— "నేటి భౌతికాదివిజ్ఞానములు శరీరభిన్నమగు ఆత్మ అను వేరొక వస్తువు లేదని చెప్పుచున్నవి" అని కొందరు విజ్ఞానవేత్తలు చెప్పుదురు. శరీరము మృతినొందగనే ఆత్మ శరీరమునందే లయమును పొందును. కావున ఆత్మ శరీరభిన్నమగు వస్తువు కాదని వారి అభిప్రాయము. సున్నము, వక్క, తమలపాకులు వేరుగా నున్నంతకాలము ఎర్రరంగు పుట్టదు. కాని అవి మూడును కలసిన వెంటనే ఎర్రనిరంగు పుట్టును. అటులనే భౌతికపదార్థమగు శరీరమునందు చైతన్యశక్తి ఉద్భవించును. కాని ఆశరీరము నశించినవెంటనే చైతన్యశక్తికూడ వెనువెంటనే నశించిపోవును. కావున జీవాత్మ శరీరమునకు భిన్నమైనది కాదు అనెదరు. కాని మన శాస్త్రములు శరీరముకంటె ఆత్మ భిన్నమయినదని చెప్పును. ఈరెండు అభిప్రాయములలోను ఏది నిజమో దయయుంచి చెప్పుడు.

## నచికేతుని ప్రశ్న - మృత్యువుతరువాత ఆత్మ ఏమగును?

స్వా. ని. :—కఠోపనిషత్తునందు నీవలెనే సాత్త్వికసాధనసంపన్నుడగు నచికేతుడు "మృత్యువుతరువాత ఆత్మ శరీరభిన్నముగ నుండునా? శరీరరూపముగా నుండునా?" అని యముని ప్రశ్నించెను.

*యేయం ప్రేతే విచికిత్సా మనుష్యేఽస్తీత్యేకే నాయమస్తీతి చైకే,*
*ఏతద్విద్యామనుశిష్టః త్వయాఽహం వరాణామేష వరః తృతీయః॥*

"కొందరు ఆత్మ ఉన్నదని చెప్పుదురు. మరికొందరు లేదని చెప్పుదురు. ఈసందేహము వారికి చనిపోయిన వ్యక్తియందు కలుగును. మీ ఉపదేశమును పొందిన నేను ఈవృత్తాంతమును తెలిసికొనదలచియున్నాను ఇది నా మూడవ వరము."

శరీరము, ఇంద్రియములు, ప్రాణములు, మనస్సు, బుద్ధి-వీనికి భిన్నమగునదియు శరీరముతో సంబంధము కలిగినదియు అగు ఆత్మ అనునది కలదని కొందరు విద్వాంసులు చెప్పుదురు. ఇట్టి ఆత్మ లేదని మరికొందరు చెప్పుదురు.ఏలనన, శరీరపాతానంతరము ఆత్మ ఉన్నదా లేదా అను సందేహము కలుగును. ఈసందేహనివృత్తి ప్రత్యక్షప్రమాణముచేత కాని, అనుమానప్రమాణముచేత కాని కలుగదు. పరమపురుషార్థము సంశయనివృత్తిద్వారా లభించు ఆత్మవిజ్ఞానమునకు లోబడియున్నది. మీ ఉపదేశముద్వారా జీవాత్మవిజ్ఞానమును పొందగోరుచున్నాను. నాకు మీరు ఇచ్చిన మూడువరములలోను మిగిలిన మూడవవరము ఇది. దీనిని నేను కోరుచున్నాను.

### జీవతత్త్వజ్ఞానము కడుసూక్ష్మము.

నచికేతుని ఈప్రార్థన విని యముడు సమాధానము చెప్పెను.

*దేవైరత్రాపి విచికిత్సితం పురా న హి సుజ్ఞేయమణురేష ధర్మః।*
*అన్యం వరం నచికేతో వృణీష్వ మా మోపరోత్సీరతి మా సృజైనమ్।*

ఓనచికేతుడా, ఈవిషయమున పూర్వము దేవతలకుకూడ సందేహము కలిగినది. సామాన్యజనులు వినినను ఈవస్తువును సరిగా తెలిసికొనలేరు. ఏలనన, ఆత్మ అత్యంతసూక్ష్మమయినది. కావున సందేహరహితమగు ఫలమునిచ్చు మరియొకవరమును కోరుకొనుము. ఈవిషయమున నన్ను ఇబ్బంది పెట్టకుము.

## ఆత్మతత్త్వము అపూర్వము.

ఇట్లు యముని వాక్యములను విని నచికేతుడు మరల యముని ప్రార్థించెను. ఈవరముతో సమానమగు మరియొకవరము నేనడుగ వలసినది లేదు. కావున అదియే కోరుచున్నాను.

దేవైరత్రాపి విచికిత్సితం కిల త్వం చ మృత్యో యన్న సువిజ్ఞేయమాత్థ।
వక్తా చాస్య త్వాదృగన్యో న లభ్యో నాన్యో వరస్తుల్య ఏతస్య కశ్చిత్॥
(కఠోప)

"ఆత్మతత్త్వమును గురించిన సందేహము దేవతలకే కలిగెను కదా! ఓయమధర్మరాజా! నీవే ఆత్మతత్త్వమును పూర్తిగా ఎరుగుదువు. కావున ఈతత్త్వమును గురించి వివరింప సమర్థుడు నీవుతప్ప మరియొకడు లేడు. నాకు దీనితో సమానమైన ఇంకొకవరము కోరవలసినది ఏదియు లేదు."

ఆత్మతత్త్వమునుగురించి సందేహము దేవతలకుకూడ కలిగెను అని మీనుండియే తెలిసికొనుచున్నాను. అనగా ఆత్మతత్త్వము సామాన్యునకు శ్రవణముచేకూడ సరిగా బోధపడదని తెలియుచున్నది ఇది పండితులకుకూడ బోధింప శక్యముకానిది. ఇక మీరు తప్ప ఇంకొక ఉపదేశకుడు ఎంత వెదకినను లభించడు. మీరు మాత్రమే ఈఆత్మతత్త్వమును వివరించగల సమర్థులు. ప్రపంచము నందలి అనిత్యపదార్థములకు సంబంధించిన వరములన్నిటిని విడచి ఈ ఆత్మతత్త్వమును మాత్రమే తెలుపగ ని కోరుచున్నాను.

## చైతన్యరహితమగు దేహమ్ము పుట్టుట.

ఈవిధముగా నచికేతుడు అడిగిన ప్రశ్నకు యమధర్మరాజు చెప్పిన సమాధానమును చూచినచో ఆత్మతత్త్వమును తెలిసికొనుట చాలకష్టమని తెలియును. ఈశరీరము పంచభూతముల (పృథివీ, జల తేజో, వాయు, ఆకాశముల) పరిణామమని కొందరు చెప్పుదురు. దానికి ప్రమాణముగా "పాఞ్చభౌతికో దేహః" అను వాక్యమును ఉద హరించెదరు. కొందరు నాల్గుభూతముల పరిణామముమాత్రమేనని చెప్పుదరు. పృథివ్యాది చతుర్భూతములయందును పరమాణువులచే కార్యారంభకత్వము సిద్ధించును. కాని పరమాణువుల అభావముచే ఆకాశమునందు కార్యారంభకత్వమునకు తావు లేదు అని వారి అభి ప్రాయము. కావున దేహము చాతుర్భౌతికము అని "చాతుర్భౌతిక మిత్యేకే" అని ప్రమాణమును చూపెదరు.

మరికొందరి మతము ననుసరించి దేహము పృథ్వీమాత్రపరి ణామము. జలాదులు దాని ఉపష్టంభకములు అనగా ఆధారములుఅని చెప్పి సాంఖ్యసూత్రమునందలి "ఏకభౌతికమిత్యపరే" అనువాక్య మును చూపెదరు. ఈవిధమగు వాదముల ననుసరించి భౌతికపరిణా మము శరీరమని చెప్పినచో చేతనత్వదృక్పథముతో విచారించిన శరీ ముపందు చేతనత్వము యుక్తసంగతము కాదు. ఏలనన, ప్రతిభూతము నందును స్వభావసిద్ధమగు చైతన్యము కనపట్టుట లేదు.

ఈవిషయమున విజ్ఞులు ఇట్లు పలెకెదరు.

"న సాంసిద్ధికం చైతన్యం ప్రత్యేకాదృష్టేః"

ప్రతిభూతమునందును చైతన్యము ఉండదు. కావున శరీరమ్ము నందుకూడ చైతన్యము లేదు అని వారి వాదము.

తాంబూలమునందలి ఎరుపు తాంబూలకారణములగు వస్తు వులయందు కనపట్టుట లేదని మీరే చెప్పుచున్నారుకదా! అయినను

అది వక్క, సున్నము మొదలగు వస్తువులతో కలిసిన పదార్థమునందు కన్పట్టుచున్నది. అటులనే ప్రతిభూతమునందును చైతన్యభావము ఉన్నను భూతస్వభావపరిణామమునందు తాంబూలమునందలి రక్తిమవంటి శక్తి కల చైతన్యము ఉండవలెను. కాని దీనికి సమాధానముగా ప్రతిపదార్థమునందును వేరువేరుగా నున్నప్పుడు కన్పడనట్టి విశిష్టగుణములు సముదాయములందు కనపడును. నైయక్తికములుగా నున్నప్పుడు మరుగుపడిన గుణములు సముదాయములయందు. కాననగును అని చెప్పెదరు.

కాని నైయక్తికపదార్థములయందు లేని గుణములు సంఘాతమునందుకూడ ఉండవు. ప్రతిభూతమునందును లేని చైతన్యము సముదాయమునందును ఉండదు. "తాంబూలవస్తుసముదాయముచే జనించిన రాగముచే తాంబూలకారణములగు ద్రవ్యములయందుకూడ రాగము ఊహించదగును. అటులనే పంచభూతకార్యమగు దేహమునందు చైతన్యము ఉండుటవలన అనుమానప్రమాణముచే ప్రతిభూతమునందును చైతన్యము ఉండవలెనని తేలుచున్నది" అని ప్రశ్నించవచ్చును.

తత్త్వవిచారము చేసినచో అవి సరికాదని తోచును. పృథివ్యాదులయందలి విశిష్టగుణములు సజాతీయకారణగుణజన్యత్వము కలవి. పృథివ్యాదిరూపమగు కారణమందు చైతన్యము లేనిచో పరిణామమగు దేహమునందుకూడ చైతన్యము ఉండదు. ఆ చైతన్యస్వరూపమగు ఆత్మ శరీరభిన్నము. శరీరమే చైతన్యరూపమగు ఆత్మ అని అంగీకరించినచో బాల్యమునందలి పదార్థములు వార్ధక్యమునందు స్మరణకు రాకూడదు. ఏలనన శరీరావయవముల ఉపచయాపచయములచే (వృద్ధిక్షయములచే) ఉత్పత్తి, వినాశములు జరుగును:

## శరీరము ఆత్మ ఒకటి కావు.

బాల్యమునందలి శరీరావయవములు వార్ధక్యమునందు ఉండవు. అందుచే విస్మృతి కలుగును. బాల్యమునందలి శరీరమునందు చైతన్యముచే కలిగిన అనుభవములు వార్ధక్యమునందలి శరీరచైతన్యమునందు జ్ఞాపకము ఉండవు. కావున శరీరము, ఆత్మ వేరువేరు అనునది నిశ్చితము. "పూర్వశరీరోత్పన్నమగు సంస్కారముచే అనంతర శరీరమునందు సంస్కారములు ఉద్భవించి స్మరణము ఉండును" అని చెప్పుచో అది యుక్తిసంగతము కానేరదు. ఏలనన, అనంతములగు సంస్కారములను అంగీకరించుటకంటె శరీరభిన్నమగు చైతన్యమును స్వీకరించుటయే యుక్తిసంగతము. శరీరమే చైతన్యమని అనుకొనినచో బాలుడు మాతృస్తన్యపానమునకు ప్రవర్తించుటకు తావు లేదు.

స్వా. ప్రి. :— దూడయొక్క స్తన్యపానప్రవృత్తికి కారణము అనుకూలసాధనత్వపరిజ్ఞానము. బాలునకు ఇష్టసాధనజ్ఞానము ఉండనందున మాతృస్తన్యపానప్రసక్తి కలుగదు. వైదికసిద్ధాంతమునను సరించి జన్మాంతరములయందలి ఇష్టసాధనజ్ఞానానుభవముచే తజ్జన్యసంస్కారములచే బాలుడు అట్లు ప్రవర్తించును.

## ఆత్మ స్వయంప్రకాశకమగు జ్ఞానస్వరూపుడు.

పూర్వోక్తములగు కారణములచే ఆత్మ శరీరభిన్నము అనునది యథార్థమని బోధపడును. ఆ ఆత్మ అవిద్యాజనితములగు అనేకజన్మముల అదృష్టముద్వారా జన్మజన్మాంతరములకు లభించును. వాస్తవమునకు ఆత్మ జ్ఞానస్వరూపము. కాని అవిద్యకు లోనయినందున అజ్ఞానివలె కన్పించును. జనులు త్రాడునందు సర్పమును చూచునట్లును, ముత్యపుచిప్పయందు రజతమును చూచునట్లును సచ్చిదానందస్వరూపమగు ఆత్మయందు అజ్ఞానకృతమున జననమరణధర్మములను చూచెదరు. జ్ఞానరూపమగు ఆత్మ పదార్థముల నన్నిటిని

ప్రకాశింపజేయును. పదార్థజ్ఞానముకూడ ఆత్మసద్భావముచేతనే కలుగును. జగమునందు జ్ఞానస్వరూపము ఆత్మ అని తెలిసికొనకుండుటకు కారణము ఏమియు లేదు. ఏలనన, సర్వప్రపంచమును ఆత్మచేతనే తెలిసికొనబడును. ఏలనన ఆత్మ జ్ఞానస్వరూపము. తాను స్వయంప్రకాశముగా నుండి అన్యములను ప్రకాశింపజేయును.

*యేన రూపం రసం గన్ధం శబ్దాన్స్పర్శాంశ్చ మైథునాన్।*
*ఏతేనైవ విజానాతి కిమత్ర పరిశిష్యతే॥ (౩౪)*

లోకమంతయు రూప, రస, గంధ, శబ్ద, స్పర్శ విషయభోగములను దేనిచే తెలుసుకొనుచున్నదో అది ఇదియే. ఇది తప్ప మిగిలినది ఇంక ఏమి కలదు? మానవులందరును జ్ఞానస్వరూపమగు ఆత్మ ద్వారా రూప, రస, గంధ, శబ్ద, స్పర్శ, విషయానుభవములను తెలిసికొనెదరు. అటులనే రూపాదుల జ్ఞానమునుకూడ పొందెదరు. స్థూలసూక్ష్మ సంఘాతరూపమగు ఈ జడశరీరముచే రూపాదిజ్ఞానము కలుగదు. సచ్చిదానందస్వరూపమగు ఆత్మ ఉండుటచేతనే రూపరసాదివిషయముల పరిజ్ఞానము ప్రాణులకు కలుగును. విశ్వమందలి పదార్థములన్నియు ఆత్మచేతనే తెలిసికొనబడును. ఆత్మ స్వయంప్రకాశమగుటచే తనంతట తానే తెలిసికొనబడును. దానిని తెలిసికొనకుండుటకు సామాన్యకారణముకాని విశేషకారణముకాని ఏదియును లేదు. ప్రధాన అజ్ఞాన విరోధియగు జ్ఞానమే ఆత్మను తెలిసికొనుటకు సాధనము. ఆత్మ అతిసూక్ష్మము. దుర్విజ్ఞేయము. అజ్ఞానముచే జీవాత్మ తాను బ్రహ్మముకంటె భిన్నుడనని అనుకొనును. ఆ కారణముచే జనన మరణప్రవాహమున మునుగుచు తేలుచు ఉండును. కాని జీవాత్మ తాను బ్రహ్మమునకు అభిన్నమని తెలిసికొనునప్పుడు ఆత్మకు శోకము కలుగదు.

## బ్రహ్మాభిన్నమగు అద్వైతాత్మ.

*స్వప్నాన్తం జాగరితాన్తం చోభౌ యేనానుపశ్యతి।*
*మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి॥*

స్వప్నావస్థయందును, జాగ్రదవస్థయందును తెలిసికొనవలసిన పదార్థములను, ఆ రెండు అవస్థలనుకూడ చూచిన విద్వాంసుడే ఆత్మ బ్రహ్మాభిన్నము అని తెలిసికొనగలడు. కల్పనాసర్వస్వమునకు అధిష్ఠానము అని గ్రహించును. అతడు జననమరణాదుల దుఃఖమును పొందడు. ఏ ప్రాణి అయినను కర్మఫలభోక్తయును, ప్రాణాదిసమూహమును ధరించునదియు జీవరూపము గల ఆత్మను, దేశకాలములను, వానియందలి పదార్థములను నియమించు ఈశ్వరుని తనకంటె అభేదముగా తెలిసికొనిన తరువాత, తనకు కలిగిన ఆ అభేదజ్ఞానానంతరము ఆత్మను పొందును. అభయస్వరూపుడగుటచే ఆత్మరక్షణకు ఆప్రాణి యత్నించడు. తానే నిత్యఅద్వైతరూపుడయిన తనను రక్షించువాడు. మరి ఇతరుడు ఎచ్చటనుండి వచ్చును? ఎవరినుండి రక్షించును? ఈవృత్తాంతమును చెప్పు శ్రుతికూడ ఇట్లు చెప్పుచున్నది.

*య ఇమం మధ్వదం వేద ఆత్మానం జీవమన్తికాత్।*
*ఈశానం భూతభవ్యస్య న తతో విజుగుప్సతే॥* (కఠ)

కర్మఫలభోక్తయును, జీవస్వరూపుడును అగు ఆత్మయు, భూతభవిష్యనియామకుడగు ఈశ్వరుడును అభిన్నులు అని తెలిసికొనినవాడు దేనినుండియు రక్షణ పొందగోరడు.

## జీవుని స్వరూపము.

పెద్దవిద్యార్థి:—మైక్రోస్కోపుతోకూడ అతికష్టమున చూడదగిన అతిసూక్ష్మజీవులయందును, ఏనుగులు మొదలగు స్థూలశరీరము కలవానియందును జీవాత్మ ఒకేరకముగా నుండునా? లేక ప్రమాణములో భేదము ఉండునా? జీవాత్మ శరీరమునంతటియందును ఉండునా? లేక ప్రత్యేకభాగమునందు ఉండునా?

## జీవాత్మ అతిసూక్ష్మము.

*వాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్య చ।*
*భాగో జీవః స విజ్ఞేయః సచాఽఽనన్త్యాయ కల్పతే॥*

"వాలాగ్రిభాగమును నూరు భాగములుగాచేసి, అందలి ఒక భాగమును మరల నూరుభాగములుగా చేసినచో ఎంత చిన్నదిగా ఉండునో జీవుడు అంత సూక్ష్మముగా నుండును."

## అతిసూక్ష్మమగు జీవుని సామర్థ్యము.

బ్రహ్మోపనిషత్తునందు ఈ వివరములు కలవు.

*నేత్రస్థం జాగరితం విద్యాత్ కంఠే స్వప్నం సమావిశేత్।*
*సుషుప్తం హృదయస్థం తు తురీయం మూర్ధ్ని సంస్థితమ్॥*

"జీవాత్మ నేత్రస్థానమున ఉన్న జాగ్రిదవస్థను పొందును. కంఠమునందున్న స్వప్నావస్థను పొందును. హృదయమునందుండగా గాఢనిద్రిను పొందును. బ్రిహ్మరంధ్రిమునందు ఉన్న తురీయావస్థను పొందును."

జీవాత్మ జాగ్రిదవస్థయందున్నపుడు నేత్రిస్థానమున ఉండి ప్రిత్యక్షాది ప్రమాణవృత్తులద్వారా సకలవ్యవహారములనుచేయును. స్వప్నావస్థయందు కంఠమునందుండి 'హిత' అను నాడియందు ప్రవేశించి భ్రిమద్వారా పెద్దపెద్ద పట్టణములు, అరణ్యములు, సముద్రములు, ఏనుగులు, గుఱ్రములు మొదలగువానిని సృష్టించును. సుషుప్తియందు హృదయప్రదేశమునందలి పురీతతమను నాడియందు ప్రవేశించుటచే బుద్ధి అవిద్యయందు లీనమయిపోవును. కాని అచ్చట అవిద్యావృత్తి యుండును. ఏలనన నిద్రినుండి లేచినతరువాత నేను సుఖముగా నిద్రించియుంటిని అని చెప్పును. ఆవృత్తిలేనిచో సుఖాద్యనుభవము ఎట్లు జరుగును? ఆవృత్తి సత్త్వప్రిధానమయిన బ్రిహ్మరంధ్రిమును చేరి సమాధిద్వారా జీవబ్రిహ్మముల మధ్యకల ఆవర

ణమును భంగముచేసి బ్రహ్మసుఖమును అనుభవించును. అదియే అద్వైత భావన అను నిర్వికల్పసమాధి. ఆసమయమున సత్త్వ ప్రధానమగు వృత్తియుండును. ఆ వృత్తికూడ స్వరూపమునందు లయమును పొందును. అదియే అద్వైతావస్థ అను నిర్వికల్ప సమాధి. అదియే గుణాతీతావస్థ.

## జనక యాజ్ఞవల్క్యుల కథ.

అనంతరము ఈవిషయముపై స్వామివారు నిత్యానందులవారిని చెప్పుమని కోరిరి.

స్వా. ని. :— బృహదారణ్యకమునందలి నాల్గవ అధ్యాయము, మూడవ బ్రాహ్మణమునందు ఈకథ కలదు.

ఒకప్పుడు జనకునివద్దకు యాజ్ఞవల్క్యుడు వెళ్లెను. వారు ఆసమయమున అగ్నిహోత్రమునుగురించి చర్చించిరి. జనకుడు అగ్నిహోత్రమునకు సంబంధించిన అపూర్వజ్ఞానమును యాజ్ఞవల్క్యుని ఎదుట వెల్లడించెను. ఆయన చాలసంతోషించి జనకుని వరము కోరుకొనమని చెప్పెను. "నాఇష్టమువచ్చిన ప్రశ్నలు అడుగుటకు వరము ఇవ్వ"మని జనకుడు కోరెను. యాజ్ఞవల్క్యుడు సంతోషముతో అంగీకరించెను. అంతట జ న క మ హా రా జు యాజ్ఞవల్క్యుని ఇట్లు ప్రశ్నించెను.

*యాజ్ఞవల్క్య కిం జ్యోతిరయం పురుష ఇతి ।*
*ఆదిత్యజ్యోతిః సమ్రాడితి హోవాచాదిత్యేనైవాయం జ్యోతిషాఽఽస్తే*
*పల్యయతే కర్మ కురుతే విపర్యేతీత్యేవమేవైతద్యాజ్ఞవల్క్య ॥*

యాజ్ఞవల్క్య! ఈపురుషుడు అనగా శరీరము దేనిచే ప్రకాశిత మగుచున్నది. శరీరము జడమే అయినను కూర్చొనుచున్నది. లేచుచున్నది. పనులను చేయుచున్నది. వెనుకకు మరలుచున్నది. ఇవన్నియు ఎట్లు జరుగుచున్నవి?

## స్వయంజ్యోతిస్స్వరూపమగు ఆత్మయే ప్రేరకము.

అంతట యాజ్ఞవల్క్యుడు "ఆదిత్యజ్యోతిః" అని సమాధానము చెప్పెను. సూర్యునినుండియే చైతన్యమును పొంది పురుషుడు సకలకర్మలను ఆచరించును. జనకుడు "సరే" అని మరల ప్రశ్నించెను. "శ్రీయాజ్ఞవల్క్య! సూర్యాస్తమయము అయినతరువాతకూడ పురుషుడు సమస్తకర్మలను ఆచరించును. అప్పుడు అతనికి చైతన్యము ఎచ్చటనుండి వచ్చును?" యాజ్ఞవల్క్యుడు "చంద్రునినుండివచ్చును" అని చెప్పెను.

జన:—"చంద్రుడు అస్తమించినతరువాత"

యాజ్ఞ: —"అగ్నినుండి"

"సూర్యచంద్రులు అస్తమించి అగ్నికూడ శాంతించిన తరువాత ఈపురుషుడు దేనిచే ప్రకాశమును పొందును? అనగా దేనిచే చైతన్యమును పొందును?" అని జనకుడు మరల ప్రశ్నించెను.

యాజ్ఞవల్క్యుడు "వాణ్యైవాస్య జ్యోతిర్భవతి" అని సమాధానము చెప్పెను.

శబ్దమే పురుషునికి జ్యోతి అనగా ప్రకాశము. దానిచేతనే ప్రేరణను పొంది పురుషుడు ప్రవర్తించును. వర్షాకాలపు చీకటిరాత్రులలో తన చేయియే తనకు కన్పించని సమయములో బాటసారులు కుక్కలు, గాడిదలు మొదలగు జంతువుల శబ్దములను విని వానిచే ప్రకాశమును పొందియే తమ గమ్యమును చేరుకొనెదరు. శబ్దశ్రవణముచే శ్రోత్రేంద్రియము ప్రకాశమును పొందును. తద్ద్వారా మనస్సున వివేకాదులు ఉద్భవించి శబ్దము వచ్చువైపునకు వెళ్ళుట మొదలగు ప్రవృత్తులు జరుగును. ఈవిధముగ అచ్చట శబ్దమే ప్రకాశము.

రాజు చెప్పెను: — "బాగుగనే ఉన్నది. కాని సూర్య, చంద్రులు, అగ్ని, వాణి అన్నియు శాంతించిన పిమ్మట స్వప్నావస్థ

యందు పురుషుడు ప్రకాశము ఎచ్చటనుండి పొందును? ఏలనన స్వప్నావస్థయందు ఈ బాహ్యేంద్రియములు వ్యవహారశూన్యము లగును. అయినను మనుష్యుడు స్వప్నావస్థయందుకూడ ప్రవృత్తు లను కలిగియుండును. ఆస్వప్నావస్థయందు ప్రకాశమును కలుగ జేయునది ఏది?

యాజ్ఞ:—ఆత్మయే పురుషుని ప్రకాశింపజేయును. ఆత్మ ప్రకాశముచేతనే ఈ పురుషుడు అన్నికర్మలను ఆచరించును.

"కతమ ఆత్మేతి" అని జనకుడు అడిగెను. ఆత్మ ఎట్టిది?

అంతట యాజ్ఞ్యవల్క్య మహర్షి చెప్పెను.

"యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృద్యన్తర్జ్యోతిః॥

ఆత్మ సక్రమముగా ఇంద్రియవృత్తులను ప్రేరేపించును. హృదయమునందుండు అంతర్జ్యోతియగు విజ్ఞానమయస్వరూపము.

"చక్షురాది ఇంద్రియములకు ప్రేరణను ఇచ్చు బహిర్గతమగు సూర్యచంద్రాదుల జ్యోతి అంతయు స్వాభావికమగు జ్యోతి కాదు. స్వయంజ్యోతిస్వరూపుని వద్దనుండి జ్యోతినిపొంది ఇంద్రియములకు ప్రేరణను ఇచ్చును." అని తాత్పర్యము.

చీకటికొట్టులోనికి సూర్యునికాంతి వెళ్ళనిచో బయట సూర్యుని వెలుతురునకు ఎదుట ఒకఅద్దమును ఉంచి ఆ అద్దముద్వారా సూర్య కాంతి చీకటికొట్టులోనికి వచ్చునట్లు చేయును. కాని ఆవెలుతురు అద్దముయొక్క వెలుతురు కాదుకదా! అది సూర్యునిదే. అటులనే సూర్యచంద్రాదులు ప్రకాశముద్వారా ఇంద్రియవృత్తులకు అను గ్రాహకములు. కాని ఆప్రకాశము సూర్యచంద్రాదుల స్వాభావిక ప్రకాశము కాదు. సూర్యచంద్రాదులు దర్పణస్థానీయులు. పరప్రకా శ్యులు. ఆసూర్యచంద్రాదులుకూడ ఎవనిప్రకాశముచే ప్రకాశితులగు దురో ఆ ఆత్మమాత్రమే స్వయంప్రకాశము.

## స్వప్నావస్థయందుకూడ ఆత్మ జ్యోతిరూపమున ప్రకాశించును

పైన ప్రత్యగ్జ్యోతి జాగ్రదవస్థయందు ఇంద్రియానుగ్రాహక మని చెప్పబడినది. ఆ విషయమును ఇంకను స్పష్టీకరించుటకు శ్రుతి స్వప్నావస్థయందుకూడ ఆపదార్థపు అస్తిత్వమును తెలుపుచున్నది.

*స సమానః సన్నుభౌ,*

ఆ ఆత్మ సమానరూపమున రెండులోకములయందును (జాగ్రదవస్థయందును, స్వప్నావస్థయందును) ప్రకాశించును. బుద్ధి తన వృత్తులద్వారా విషయజ్ఞానమును పొందును. ఆసమయమున ఆత్మ కూడ విషయజ్ఞానమును సంపాదించుచున్నట్లు భాసించును. (ధ్యాయతి ఇవ). ఆత్మ విజ్ఞానస్వరూపము. నిత్యమును జ్ఞానస్వరూపమును అయిన ఆత్మను క్షణికవిజ్ఞానరూపముగా తలచుట తప్పు. కాని బుద్ధి వృత్తిమాత్రము క్షణికమగుటచే బుద్ధి క్షణికవిజ్ఞానము కలది. అందుచే ఆత్మకూడ క్షణికవిజ్ఞానము కలదిగా తోచును. బుద్ధి తనవృత్తుల ద్వారా చలనాదిక్రియలను చేయించునప్పుడు ఆత్మకూడ ఆక్రియలకు కర్తగా ప్రతీతమగును. (లేలాయతి ఇవ). వాస్తవమునకు అది కర్త కాదు.

ఆ ఆత్మయే స్వప్నరూపమున ఈలోకమును, అనగా జాగ్రదవస్థను, మృత్యురూపములగు అవిద్యాకర్మలను అతిక్రమించును. అనగా స్వప్నావస్థను పొందుటతోడనే జాగ్రదవస్థాబోధ్యములగు విషయములు, కర్మలు అన్నియును నశించును. ఏలనన స్వయంజ్యోతి యగు ఆత్మ స్వప్నసంబంధములగు పదార్థములను సృష్టించుకొనును. ఒకే శరీరమునందు ఉన్న ఆత్మ స్వప్నరూపమును పొంది మృత్యు రూపములగు కార్యకారణాదులను త్యజించి స్వప్నమునందు స్వకీయ మగు ఆత్మజ్యోతిస్స్వరూపమును పొందును.

# ఈలోకమునందు పరలోకమునందును కూడ ఆత్మ స్వయంజ్యోతియగు ప్రేరకము.

*స వా అయం పురుషో జాయమానః శరీరమ్.*

ఈ ఆత్మయే శరీరము అను ఉపాధి ఉద్భవించుటతో ఉద్భవించుచున్నట్లు భాసించును. ధర్మాధర్మాశ్రయమగు శరీరమును ఇంద్రియములకు సంబంధింపజేయును. ఇది శరీరమును త్యజించి ఉత్క్రమణమునకు సిద్ధమయినప్పుడు శరీరమును మృతినిపొందును. అంత శరీరమునకు సంబంధించిన పాపపుణ్యాదికర్మలు, వాని సాధనములగు ఇంద్రియాదులును ఆసంబంధమును త్యజించును.

స్వప్నజాగ్రదవస్థలయందు రెండింటియందును ఆత్మ ఒకే శరీరమునందు ఉండికూడ జాగ్రదవస్థయందు శరీరముయొక్క ఇంద్రియాదుల కార్యాచరణమును గ్రహించియు, స్వప్నావస్థయందు త్యజించియు బుద్ధితో నిరంతరము సంచరించుచుండును అటులనే ("ఉభౌ లోకౌ") రెండులోకము లనగా ఇహలోక, పరలోకములు_స్వర్గ పాతాళములు, రెంటియందును జన్మ, మరణములద్వారా కార్య కరణసంఘాతమును కలిగి (శరీరేంద్రియములను పొంది) నిరంతరము సంచరించుచుండును. సంసారమునుండి ముక్తిని పొందువరకు ఇటులనే జరుగుచుండును.

దీనినిబట్టి కార్యకరణసంఘాతముకంటె (శరీర, ఇంద్రియాదులకంటె) ఆత్మ భిన్నమయినదని రుజువయినది. శరీరేంద్రియరూపము ననే ఆత్మ ఉన్నచో ఆత్మకు వానినుండి విడువడుట అసంభవము. అగ్నిజ్వాల ప్రకాశరూపము. ఆ అగ్నినుండి జ్వాలయు, ప్రకాశమును విడువడలేవు. కాని ఆత్మనుండి కార్యకరణసంఘాతము వేరువడును. కావుననే ఆత్మ కార్యకరణసంఘాతముకంటె వేరు.

ఆపురుషుని వాసస్థానములు రెండు. 1. ప్రత్యక్షానుభూయమానమగు ఈశరీరము. 2. శరీరవియోగానంతరము అనుభూయమానమగు పరలోకము. మూడవది లేదు. స్వప్నము ఈరెంటికిని సంధి. రెండుగ్రామముల సరిహద్దు రెండుగ్రామములకంటెను వేరు కాదు. అచ్చట నిలబడినచో రెండుగ్రామములను చూడవచ్చును. అటులనే స్వప్నస్థానమునందు ఉండి ఆత్మ ఈలోకమును, పరలోకమును రెంటిని అనుభవించును. పరలోకమునందు పాపములను, ఆనందమును రెంటిని అనుభవించును. ఈలోకమునందు అనుభావ్యములగు పదార్థములను కూడ అనుభవించును. ఏలనన స్వప్నము పూర్వము చూడనివానిని చూపించదు. పూర్వదృష్టపదార్థముల స్మరణమే స్వప్నము. పురుషుడు స్వప్నావస్థకు జేరినప్పుడు భూత, భౌతిక మాత్రములను (అంశములను) కూడ తీసికొనివెళ్ళును. అనగా జాగ్రదవస్థయందు చూచిన పదార్థముల వాసనలతో స్వప్నావస్థను పొందును. అనంతరము తానే తనకు లభించిన జాగ్రత్ శరీరమును త్యజించి వాసనామయమగు స్వప్నశరీరమును నిర్మించి తనదీప్తిచే ప్రకాశించుచున్న స్వప్నపదార్థములను అనుభవించును.

అత్రాయం పురుషః స్వయంజ్యోతిర్భవతి.

"ఈస్వప్నావస్థయందు పురుషుడు స్వయంజ్యోతి."

స్వప్నదర్శనమునందు జాగ్రుతికంటె వైలక్షణ్యము కలదు. జాగృతియందు ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, సూర్యప్రకాశములు. మొదలగువానిచే సంకీర్ణమగుటచే ఆత్మజ్యోతి నిశ్చయించబడజాలదు. ఈ ప్రకాశము ఎవరిది? ఇంద్రియములదియా? మనస్సుదియా? బుద్ధిదియా?, సూర్యునిదియా?, ఆత్మదియా? అనునది నిశ్చయించుట జరుగదు. స్వప్నమునందు ఇవి ఏమియు ఉండవు, ఆత్మయే ఉండును. కావున స్వప్నావస్థయందలి ప్రకాశముఆత్మదియే అనియు, ఆత్మ

స్వయంజ్యోతి అనియు అంగీకరించవలెను. జాగ్రతియందలి విషయ ములే స్వప్నమునందును కలవు. స్వప్నమునందు జాగృతికంటె ఏమి వైలక్షణ్యము కలదు? ఆత్మ స్వప్నావస్థయందు స్వయంజ్యోతి అను టకు తగిన ఆధారమేమి అను ప్రశ్నకు శ్రుతిప్రమాణము కలదు.

*"న తత్ర రథా న రథయోగా న పన్థానో భవన్త్యథ రథాన్ రథయోగాన్ పథః సృజతే"*

స్వప్నమునందు రథములు, గుర్రములు, నడచుమార్గములు ఏమియును ఉండవు. కాని స్వప్నమునందలి ఏకాగ్రచిత్తతచే తానే అన్నిటిని సృజించుకొనును. ఒరనుండి వెలికి తీయబడిన కత్తివలె బుద్ధ్యాది ఉపాధిరహితమగు ఆత్మ స్వయముగా స్వకీయమగు జ్యో తిచే ప్రకాశమానమగుచు స్వప్నావస్థయందు ప్రతీతమగును.

*"న తత్రాఽఽనన్దా ముదః ప్రముదో భవన్తి"*

స్వప్నావస్థయందు ఆనందాదులు ఏమియును ఉండవు. వానిని అన్నిటిని ఆత్మ తానే సృష్టించుకొనును.

*"తదేతే శ్లోకా భవన్తి। స్వప్నేన శరీరమభిప్రహత్యాసుప్తః సుప్తానభిచాకశీతి। శుక్రమాదాయ పునరైతి స్థానమ్."*

స్వప్నభావముద్వారా జాగ్రత్ శరీరమును నిశ్చేష్టమొనరించి ఆత్మ తాను సుప్తావస్థను పొందకుండ ఉండి సుప్తావస్థను పొంది తన ఆక్రమణతో నశించిన బాహ్య, ఆధ్యాత్మిక భావములను అన్నిటిని శరీర, అంతఃకరణాదులను భావింపజేయును. అనంతరము శుద్ధజ్యోతి రూపమును పొంది కర్మలను ఆచరించుటకు జాగృతిలోనికి వచ్చును.

*హిరణ్మయః పురుష ఏకహంసః.*

పురుషుడు చైతన్యజ్యోతియే స్వభావముగాకలవాడు. ఆ ఒకడే జాగృతి, స్వప్న, ఇహలోక, పరలోకము లన్నిటిలోనికి వెళ్ళును.

అటులనే పంచేంద్రియవృత్తికల ప్రాణముద్వారా అత్యంత అశుద్ధమగు శరీరమును రక్షించుచు శరీరమునకు బయటనే ఉండును.

అనగా శరీరముతో సంబంధము లేకుండ శుద్ధముగనే ఉండి కోరిన చోటికి వెళ్ళును.

స్వప్నావస్థయందు ఒకప్పుడు దేవాదిభావములను పొందును. మరియొకప్పుడు పశ్వాదిభావములను పొందును. ఇట్లు వాసనానుసారము అనేక భావములను పొందును. ఒకప్పుడు స్త్రీలనుకూడి ఆనందించును. మరియొకప్పుడు మిత్రులతో ఆనందించును. భుజించుచు, తిరుగుచు ఉండును. మరియొకప్పుడు సింహాదిప్రాణుల భయమును కూడ అనుభవించును.

మానవులందరును ఈ ఆత్మ సృజించిన వాసనాయుతమగు క్రీడ, ఆనందము మొదలగువానినే చూడగలరు. కాని ఎవరును వానిని సృజించిన ఆత్మను చూడలేరు. "స్వప్నావస్థయందు అత్యంత వివిక్తమును స్వయంజ్యోతిస్వరూపమును అగు ఆత్మ దృగ్గోచరమగుచున్నను జనులు దానిని చూడలేరు. ఇది ప్రపంచపు దురదృష్టము మాత్రమే" అని శ్రుతిస్పష్టముగా ఖేదమును ప్రకటించుచున్నది.

స్వప్నావస్థయందలి- నిద్రించిన- మనుష్యుని లేపరాదని వైద్యులు చెప్పిరి. ఏలనన, ఇంద్రియములను త్యజించి ఆత్మ స్వప్నావస్థయందు విహరించుటకు వెళ్లినది. లేపుతొందరలో నేత్రములు,కర్ణములు మొదలగు ఇంద్రియములను పొందలేకపోయినచో ఔషధసేవచే చికిత్సచేయుటకు వీలుపడదు. నిత్యాంధత్వము, బధిరత్వము మొదలగుదోషములు కలుగును. దీనినిబట్టికూడ ఇంద్రియేతరమగు ఆత్మ ఏకైకమగు స్వయంజ్యోతి అని రుజువు అగుచున్నది.

స్వప్నలోకము వేరొకటియా? కాదా? అను ప్రశ్నకూడ విచారించదగినదే. జాగృతియందలి లోకమే స్వప్నలోకమగుటకు వీలుపడదు. ఏలనన, స్వప్నమున ఇంద్రియములు అన్నియును ఉపరతిని పొందును. ఇక చూచుట, వినుట దేనిచే సంభవించును? ఇంద్రియములు ఉపరతిని పొందినతరువాతనే స్వప్నములు చూచుట జరు

గును. ఇందువలననే శ్రుతి చెప్పుచున్నది. "న తత్ర రథా న రథ యోగాః"

ఇట్టి స్వయంజ్యోతియగు ఆత్మను యాజ్ఞవల్క్యుడు జనక మహారాజుకు తెలిపెను.

కాని జనకుడు మరల ప్రశ్నించెను. ఇంకను విమోక్షమునకు సంబంధించిన ప్రశ్న నేను అడుగవలసియున్నది. విమోక్షముయొక్క ఏకదేశిత్వము, విమోక్షముయొక్క ఉపయోగము, ఆత్మయొక్క స్వయంజ్యోతిత్వము– వీనినిగురించి తమరే సెలవిచ్చిరి. ఇక సంసారమునుండి ముక్తి కలుగుమార్గమును నాకు తెలుపుడు.

## విమోక్షము ఎట్లు కలుగును.

ఇంతవరకు ఆత్మ స్వయంజ్యోతిస్వరూపము అనునది రుజువు చేయబడినది. కాని శ్రుతి ఇట్లు చెప్పుచున్నది.

"స్వప్నో భూత్వేమం లోకమతిక్రామతి మృత్యో రూపాణి."

స్వప్నరూపమును పొంది ఈఆత్మ ఈలోకమును మృత్యురూపమగు అవిద్యాకర్మాదులను అతిక్రమించును. అందు ఇంకను సందేహమునకు చోటు కలదు "మృత్యురూపమును అతిక్రమించును కాని మృత్యువును మాత్రము అతిక్రమించదుకదా" అని అడుగ వచ్చును. అంతియెకాదు. స్వప్నమునందుకూడ భయంకరమగు ప్రాణులు మొదలగువానిని చూచిన భయత్రాసాదులు ప్రత్యక్షమగును. అందుచే మృత్యువును అతిక్రమించలేదు అను విషయము నిశ్చయమగుచున్నదికదా! ఇక విమోక్షము ఎట్లు కలుగును? ఈసందేహమునకు సమాధానము యాజ్ఞవల్క్యుడు ఎట్లుచెప్పుచున్నదియు విచారించుదము.

"మృత్యువు ఆత్మయొక్క స్వభావముకాదు. ధర్మము కాదు." అనునది రుజువు అయినచో విమోక్షవిషయము రుజువగును.

## ఆత్మ నిత్య శుద్ధ, బుద్ధ, ముక్తము.

"సవా ఏష ఏతస్మిన్ సంప్రసాదే రత్వా చరిత్వా దృష్ట్వైవ పుణ్యంచ పాపం చ పునః ప్రతిన్యాయం ప్రతియోన్యాద్రవతి స్వప్నాయైవ స యత్తత్ర కించిత్పశ్యత్యనన్వాగత స్తేన భవత్యసంగో హ్యాయం పురుష ఇత్యేవ మేవం తద్యాజ్ఞ్యవల్క్య సోహం భగవతే సహ స్రం దదామ్యత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి॥"

ఆ ఆత్మయే సుషుప్తియందు సంచరించి, ఆనందమునుమాత్రమే అనుభవించి, పుణ్యపాపములను చూచి (అనుభవించి కాదు) వెళ్లిన క్రమమునకు విపరీతక్రమమున స్వప్నమునందే తిరిగి వచ్చును. (మెట్లు ఎక్కి మేడలోనికి వెళ్లినవాడు తిరిగి వెనుకకు వచ్చునప్పుడు మొదట ఎక్కిన మెట్టుపై, అన్నిటికంటె చివరను కాలుఉంచును. అటులనే జాగృతినుండిస్వప్నములోనికిని, స్వప్నమునుండిసుషుప్తిలోనికిని వెళ్లును. కావున సుషుప్తినుండి స్వప్నములోనికిని స్వప్నమునుండి జాగృతిలోనికిని వెనుకకు మరలును. సుషుప్తినుండి తిన్నగా జాగృతిలోనికి రాదు. "ప్రతిన్యాయం" అనగా విపరీతక్రమమున అని అర్థము )

ఈస్వప్నమున ఏమిచూచినను, చెప్పినను, వానితో ఆత్మ లిప్తమవదు. ఎట్లనిన, స్వప్నమునందు ఏదైన హత్యచేసినసంగతి మిత్రమండలియందు చెప్పినను ఆవ్యక్తిని పాపాత్మునిగా మిత్రులు తలచరు. అటులనే దానివి ఏదియును స్పృశించలేదు. ఏలనన, ఆత్మ నిర్లిప్తము.

ఈ విషయమున ఒక దృష్టాంతము కలదు.

ఒక బ్రాహ్మణునకు స్వప్నము వచ్చెను. స్వప్నమున ఆతడు ఒక జలాశయమువద్దకు జలమును త్రాగుటకు వెళ్లెను. ఆ సరోవర తీరమున ఒక పెద్ద నేరేడుచెట్టు ఉండెను. దానియొక్క ఒకలావైన కొమ్మపై ఒక కిరాతకుడు కూర్చుని నేరేడిపండ్లు తిని దానిగింజలు సరోవరములోనికి విసరుచుండెను. ఈసంగతి బ్రాహ్మణునకు తెలి

యుడు. ఆతడు తొందరతొందరగా దోసిలితో నీరు త్రాగుచుండెను. ఒకమారు దోసిలిలోనికి నీటితోపాటు నేరేడుగింజ వచ్చి నోటిలోనికి పోయెను. పైకి చూచుసరికి బ్రాహ్మణునకు ఆ కిరాతకుడు కన్పిం చెను. తాను కిరాతకుని ఉచ్ఛిష్టమును తిని అపవిత్రుడనైతిని అను విచారము ఆతనికి కలిగెను. దానితో ఆతడు మేల్కాంచెను. మేల్కొనినతరువాతకూడ ఆతనికి చాలపశ్చాత్తాపము కలిగెను. తాను జాతి భ్రష్టుడ నైతినని తలచి ప్రాయశ్చిత్తమును తెలిసికొనుటకు పురోహితునిచెంతకు వెళ్లెను. పురోహితుడు తెలివైనవాడు. ఆకారణముచే ఆతడు ఇట్లు చెప్పెను. "నీవు స్వప్నమునందు ఉచ్ఛిష్టము తింటివి. కావున దానిప్రాయశ్చిత్తముకూడ స్వప్నమునందలి పురోహితుడే చెప్పును."

స్వప్నము మిథ్య. అందుచే సత్ స్వరూపమగు ఆత్మకు ఏవిధమగు దోషమును కలుగదు. కావుననే ఆత్మ నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావము కలదని చెప్పెదరు.

## ఆ త్మ ని ర్లి ప్త ము.

ఈవిషయము విని జనకమహారాజు చెప్పెను. "ఓయాజ్ఞవల్క్య! తమరు చెప్పినది యథార్థము. ఆత్మ కర్మలకు సంబంధించదు అని మోక్షపదార్థముయొక్క ఏకదేశకర్మప్రవివేకమును తెలిపితిరి. ఇక మోక్షమునుగురించి తిరిగి తెలుపుడు.

అంతట యాజ్ఞవల్క్యుడు చెప్పెను.

సుషుప్తినుండి స్వప్నములోనికి వచ్చినట్లుగనే, స్వప్నమునందు ఆనందించి మరల జాగృతిలోనికి వచ్చును. స్వప్నమునందు కర్మాదులచే ఆత్మ కొంచెమైనను లిప్తముకాదు. ఏలనన, అది నిస్సంగము. నిస్సంగత్వముచే కర్తృత్వముకూడ లేదు. స్వప్నమునందు కామములును, సాంగత్యమును ఆత్మకు ఉన్నచో వానితో ఆసాంగత్యదోషములతో జాగృతిలోనికి రావలసియున్నది. కాని అట్లు జరుగుట లేదు.

ఈవిధముగనే ఈ ఆత్మ జాగ్రుతియందు ఆనందించి, మరల పుణ్యపాపములను చూచియే, క్రమముగా జాగృతినుండి స్వప్నమునకు చేరును. కావున జాగృతియందుకూడ ఆత్మ నిస్సంగమే. ఏరకపు కార్యములచేతను ఆ ఆత్మ బద్ధమగుటలేదు. ఆత్మజ్యోతిమాత్రముచే అవభాసితమగుచున్న కార్య (శరీరము) కరణ (ఇంద్రియములు) సంఘాతముమాత్రమే కర్మాదులను ఆచరించుచున్నది. ఆత్మ స్వయం జ్యోతిస్వభావము కలిగినది అగుటచే దానిని ఏకర్మయును బంధించుటలేదు. బుద్ధ్యాదిఉపాధులచే ఆత్మయందు పరిలక్షితమగు కర్తృత్వము ఔపచారికము. కావుననే శ్రుతి "ధ్యాయతి ఇవ, లేలాయతి ఇవ" అని 'ఇవ' శబ్దముతోనే వివరించినది. వాస్తవమునకు ఆత్మ ఏమియును చేయుట లేదు.

ఈవిధముగా జాగృతి, స్వప్న, సుషుప్తి అవస్థలయందు ఆత్మ నిర్లిప్తము, కర్తృత్వరహితము, స్వయంజ్యోతిస్వరూపము అనునవి రుజువు అయినతరువాత చెప్పవలసినది ఇక ఏమియు లేదు. కావున దృష్టాంతమునుమాత్రమే శ్రుతి తెలుప ప్రయత్నించుచున్నది.

*"తద్యథా మహామత్స్య ఉభే కూలే అనుసంచరతి పూర్వం చాపరం చైవమేవాయం పురుష ఏతావుభావన్తావనుసంచరతి స్వప్నాన్తం చ బుద్ధాన్తం చ॥"*

పెద్దతిమింగిలము నదీతీరములను రెంటిని ఆనుకొని సంచరించునట్లు‒ నదీప్రవాహముపై ఆధారపడక, ఇష్టమువచ్చినట్లు సంచరించునట్లు‒ఆత్మకూడ స్వప్న, జాగృతులయందు స్వేచ్ఛగా సంచరించును.

భౌతికాకాశమున శ్యేనము ఇష్టమువచ్చినట్లు ఎగిరి అలసిపోయినతరువాత తనగూటిలో రెక్కలను ముడుచుకొని కూర్చొనినట్లు ఈఆత్మకూడ జాగృతి, స్వప్నములయందు ఇష్టమువచ్చినట్లు విహా

రించి శాంతికొరకు సుషుప్తిస్థానమునకు వచ్చును. అచ్చట ఏకామము ఉండదు. ఏస్వప్నమును ఉండదు.

ఆత్మయొక్క స్వభావము సర్వసంసారధర్మశూన్యత్వమును, పరోపాధినిమిత్తముమాత్రమే అగు సంసారధర్మత్వము అయినచో పరోపాధిరూపమగు అవిద్య స్వాభావికమా? ఆగంతుకమా? ఆగంతుకమయినచో వియోగమును పొందుటకు వీలుపడును కాని ఆగంతుకమనుటకు ప్రమాణము ఏది? అవిద్య ఆత్మయొక్క ధర్మము ఏల కాదు? ఇట్టి సందేహములను పోగొట్టుటకొరకు సకల అనర్థములకును బీజమగు అవిద్యయొక్క తత్త్వమును బోధపరచుటకు క్రింది శ్రుతి తెలుపబడినది.

"తా వా అస్యైతా హితా నామ నాడ్యో యథా కేశః సహస్రధాభిన్నః తావతాఽణిమ్నా తిష్ఠన్తి శుక్లస్య నీలస్య పిఙ్గలస్య హరితస్య లోహితస్య పూర్ణా అథ యత్రైనం ఘ్నన్తీవ జినన్తీవహస్తీవ విచ్ఛాయయతి గర్తమివ పతతి యదేవ జాగ్రద్భయం పశ్యతి తదత్రావిద్యయా మన్యతేఽథ యత్ర దేవ ఇవ రాజేవాహమేవేదం సర్వోఽస్మీతి మన్యతే సోఽస్య పరమో లోకః॥"

ఈపురుషునియందు (శిరము, చేతులు, కాళ్ళు మొదలగునవి కలవానియందు) "హిత" అను పేరుకల నాడులు కలవు. ఇవి కేశమును వేయిభాగములుగా చీల్చినను ఏర్పడు స్వరూపముకంటె సూక్ష్మముగా నుండును. అవి వాత, పిత్త, కఫ మిశ్రమమున తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు మొదలగు రంగులను కలిగి యుండును. పంచప్రాణములు, దశేంద్రియములు, మనస్సు, బుద్ధియును కలసి లింగదేహము అగును. అది సూక్ష్మముగను, స్వచ్ఛముగను ఉండి నాడులయందలి రసముల ఉపాధిచే స్త్రీ, ఏనుగ, గుఱ్ఱము

రథము మొదలగు ఆకారవిశేషములుకల వాసనలను పొందును. అట్టి స్థితిలో (స్వప్నమునందు) శత్రువులుకాని, దొంగలుకాని వచ్చినచో నన్ను శత్రువులు కొట్టిరి, దొంగలు నాసొత్తు ఎత్తుకొనిపోయిరి. మొదలగు వాసనానిమిత్తమగు అసత్యప్రతీతి కలుగును. అంతట ఆతడు దుఃఖించును. కాని ఇదంతయును అవిద్యాకృతము.

## సర్వాత్మభావము ఆత్మయొక్క పరమలోకము.

ఆ అవిద్య నశించి దేవతావిషయకమగు విద్య జనించినప్పుడు (జాగ్రత్ కాలమున) ఆ వాసనలద్వారా తాను దేవుడనని తలచును. అవిద్య ఉద్భవించినప్పుడు స్వప్నమునందుకూడ నేనే ఈరూపములను అన్నిటిని పొందుచున్నాను అను భావము కలుగును. ఈవిధమగు జ్ఞానము ఆత్మయొక్క సర్వాత్మభావము. ఇదియే పరమలోకము.

సర్వాత్మభావము, లేక విద్యాఫలస్వరూపమగు, మోక్షమునుగురించి శ్రుతులు చెప్పుచున్నవి. అది మొదట ప్రస్తావించబడినది.

"యత్ర సుప్తో న కంచన కామం కామయతే" (ఈవిధముగా సుషుప్తిరూపమున) అదియే ఈపురుషుని వాస్తవికరూపము. సర్వాత్మభావమును గురించి వెనుకటి శ్రుతియందే "సోఽస్య పరమోలోకః" అని చెప్పబడినది.

*తద్వా అస్యైతదతిచ్ఛన్దా అపహతపాప్మాభయగ్ం రూపమ్। తద్యథా ప్రియయా స్త్రియా ।*

ఆ ఆత్మయొక్క స్వరూపమే అతిచ్ఛందము. అనగా కామనారహితము, పాపరహితము, అభయస్వరూపము. ఆ పరమాత్మస్వరూపమే తన ఆత్మతో పరిష్వక్తమగును. అది బాహ్యావస్తువుతో

ఆంతరంగికవస్తువురూపో ఎవరును తెలిసికొనలేరు. ఇదియే ఈపురుషుని స్వరూపము.

ఈపురుషుడు "ఆప్తకాముడు" అనగా అన్నికోరికలును ఇతనిని పొందియుండును. ఇతడు ఆత్మకాముడు. ఆత్మనుమాత్రమే కోరుచుండును. అకాముడు. ఏవిధమగు కోరికయు ఇతనియందు ఉండదు.

ఈసమయమున తండ్రికొడుకులు, తల్లికొడుకులు మొదలగు సంబంధములు విడిపోవును. మానవదేవాదిభావములు నివృత్తిని చెందును. చోరుడు, పాపాత్ముడు, భ్రూణహత్యచేసినవాడు, చండాలుడు (శూద్రునిచే బ్రాహ్మణస్త్రీయందు జనించినవాడు) పౌలుసుడు శూద్రునిచే క్షత్రియస్త్రీయందు జనించినవాడు) శ్రమణుడు(సన్యాసి) తపస్వి (వానప్రస్థుడు) మొదలగు భావములు అన్నియును నివృత్తిని పొందును. పురుషుడు పుణ్యపాపరహితుడగును. అన్నిరకములగు హృదయశోకములకును అతీతుడగును.

మరియొక సందేహము కలుగవచ్చును. స్వయంజ్యోతిష్ట్వము అనగా చైతన్యాత్మస్వభావము. చైతన్యాత్మస్వభావము ఆత్మది కదా! ఆస్వభావమును ఆత్మ త్యజించునా? అగ్ని ఉష్ణత్వ, ప్రకాశత్వములను త్యజించదు. కాని సుషుప్తియందు తన చైతన్యాత్మస్వభావము చూడనగుటలేదే అని అడుగవచ్చును. ఈసందేహమునకు ఈ శ్రుతి సమాధానము చెప్పుచున్నది.

*యద్వై తన్న పశ్యతి పశ్యన్వై తన్న పశ్యతి న హి ద్రష్టుర్ద్రష్టేర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాత్ । న తు తద్ ద్వితీయమస్తి తతోఽన్యద్విభక్తం యత్పశ్యేత్ ॥*

సుషుప్తియందు అది చూచుటలేదు. అది దృష్టికలిగియున్నను చూచుటలేదు. అవినాశియగుటచే ద్రష్టయొక్క స్వరూపమగు దృష్టి నశించదు. అగ్నియొక్క ఉష్ణము నశించనివిధముగా దానిదృష్టికూడ

నశించదు. అదితప్ప మరియొకటి లేదు. ఇక దేనినిచూచును? సుషుప్తి యందు ఆత్మ దేనిని చూచుటలేదు. ఇంద్రియవృత్తులన్నియు శాంతించుటచే ఏమియును అనుభవించుట లేదు అని తోచును.అదిసరికాదు. ఏలనన, సుషుప్తియందు కూడ జ్ఞానము ఉండును. ద్రష్టయగు ఆత్మ యొక్క దృష్టి విజ్ఞానశక్తి. అది ఎప్పుడును నశించదు. అది నశ్వరము కాదు. అయినను కొంచెము భేదముమాత్రము కలదు. ఆస్థితియందు ద్రష్ట వ్యతిరిక్తమగు జీవుడు వేరొండు ఉండడు. ఇక చూచువాడు ఎవడు? చూచునది ఏమి? ఆసమయమున స్వరూపజ్ఞానము మాత్రమే కలుగును.

ఇదేవిధముగ సుషుప్తియందు ఆత్మకు ఘ్రాణము, జిహ్వ, ఉచ్చారణము, శ్రవణము, విచారణము, స్పర్శ, విజ్ఞానము మొదలగు శక్తులు అన్నియును ఉన్నను ఆత్మభిన్నమగు వేరొకటి లేనందున వేరుగా వాసనచూచుట, రుచిచూచుట మొదలగు క్రియలు తెలిసికొనబడవు. ఇతరవస్తువు ఏదైన ఉన్నను చూచువాడు ఎవడైన ఉన్నను ఈక్రియలు అన్నియును జరుగును. కాని సుషుప్తియందు వేర్వేరు వస్తువులను నిర్మించు అవిద్యయే శాంతించినప్పుడు ఎవరు ఎవరిని చూచుదురు?

బృహదారణ్యకోపనిషత్తునందు యాజ్ఞవల్క్యఋషి జనకునకు చెప్పెను.

*సలిల ఏకో ద్రష్టాఽద్వైతో భవత్యేష బ్రహ్మలోకః సమ్రాడితి హైన మనుశశాస యాజ్ఞవల్క్య ఏషాస్య పరమాగతిరేషాఽస్య పరమా సంపదేషోఽస్య పరమో లోకఏషోఽస్యపరమ ఆనన్దఏతస్యైవాఽఽనన్ద స్యాన్యాని భూతాని మాత్రాముపజీవన్తి॥*

ఓ జనకమహారాజా! ఆత్మ జలమువలె పరిశుద్ధమైనది, ఏకము, ద్రష్ట, అద్వితీయము. ఈ ఆత్మయే బ్రహ్మలోకము. బ్రహ్మ

ప్రాప్తియే జీవాత్మయొక్క పరమగతి. అదియే శ్రేష్ఠమగు సంపద. అదియే జీవాత్మయొక్క పరమలోకము. అదియే దానికి పరమానం దము. ఆబ్రహ్మానంద లేశముచేమాత్రమే- అంశముచేమాత్రమే ప్రాణులన్నియును జీవించును. ఆనందించును.

"అత ఊర్ధ్వం విమోక్షాయైవ బ్రూహీతి."

ఇటుపైనకూడ మోక్షమును పొందుటకు చెప్పుమని యాజ్ఞ వల్క్యుని జనకుడు కోరెను. ఈప్రశ్నవిని యాజ్ఞవల్క్యుడు ఆశ్చర్య మును పొందెను. భయమును పొందెను. ఆయన ఇట్లనుకొనెను. "కామ్యమగు ప్రశ్నకు నేను విమోక్షసాధనమగు నిర్ణయమును తెలి పితిని. అనగా ప్రశ్నయొక్క ఏకదేశిత్వమును మాత్రమే గ్రహించి తిని. కావుననే ఈరాజు తిరిగితిరిగి నన్ను ప్రశ్నించుచున్నాడు. ఈయన మహామేధావి. ఈయన నన్ను నలువైపులనుండియు చుట్టు ముట్టెను. నేను స్వప్నజాగృతులయందలి సంచారముద్వారాను, సుషుప్తి వివరణము ద్వారాను కారణరహితప్రపంచమును గురిం చియును, మోక్షమును గురించియును వివరించితిని. దానిని రాజు దృష్టాంతరూపమున గ్రహించెను. కావుననే మరల ప్రశ్నించు చున్నాడు." ఈవిధముగా తలచి యాజ్ఞవల్క్యుడు ఉత్తరగ్రంథ మున సాధనయుత ప్రపంచమునుగురించియు, మోక్షసిద్ధాంతమును గురించియును తెలిపెను.

ఆత్మ స్వప్నావస్థయందు క్రీడించి సుఖదుఃఖములను అనుభ వించి మరల జాగృతికి విపరీతగమనమున వచ్చును. కారణమగు జాగృతికి చేరును. రాజు వెళ్ళుచున్నప్పుడు ఉగ్రకర్మలను చేయు సూతాద్యులు రాజాజ్ఞ లేకపోయినను ఆయనవెనుక వెళ్ళునప్పుడు ఆత్మ ఊర్ధ్వగమనము చేయుచున్నప్పుడు- మరణకాలమున- ప్రాణ

ములు, వాగాది ఇంద్రియములు, ఒకచోటికిచేరి తృణజలూకాన్యాయమున వేరొకశరీరమును గ్రహించినతరువాత దీనిని త్యజించును.

స వా అయమాత్మా బ్రహ్మ

ఆ ఆత్మయే బ్రహ్మరూపము. విజ్ఞానమయము, మనోమయము, ప్రాణమయము, చక్షుర్మయము మొదలగునవి. ఈబృహదారణ్యకమహావాక్యమును (యజుర్వేదీయమహావాక్యమును) చెప్పి బ్రహ్మస్వరూపమగు ఆత్మయొక్క యథార్థమును ఉపదేశించి యాజ్ఞవల్క్యుడు జనకమహారాజు అజ్ఞానమును పోగొట్టెను.

అనంతరము దర్బారునుండి భోజనమునకు కబురువచ్చుటచే అందరును భోజనమునకు లేచిరి.